మన్యంలో చలి పులి పంజా

- తగ్గిన ఉష్ణోగ్రతలు
- చింతపల్లిలో 14.6 డిగ్రీలు నమోదు



పాడేరులో చలిమంటలు కాగుతున్న యువకులు

సాక్షి, పాడేరు: చలి పులి పంజా అల్లూరి సీతారామరాజు జిల్లా వాసులను వణికిస్తోంది. ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టడంతో చలి గాలులు విజృంభిస్తున్నాయి. మంగళవారం చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 14.6 డిగ్రీలు, పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీబోర్డులో 15 డిగ్రీలు, అరకులోయ కేంద్ర కాఫీబోర్డులో 15.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పొగమంచు దట్టంగా కురుస్తోంది. ఉదయం 9 గంటల వరకు మంచు తెరలు వీడడం లేదు. సాయంత్రం నాలుగు గంటల నుంచే చలిగాలులు వీస్తుండడంతో గ్రామాల్లో ప్రజలు చలిమంటల వద్ద చేరుతున్నారు. రాత్రి వేళ రెండు రోజుల నుంచి చలి ప్రజలను మరింత వణికిస్తోంది.

సులభంగా ఆరోగ్యశ్రీ సేవలు పొందేలా..

పథకం పట్ల ప్రజలకు పూర్తి అవగాహన కల్పించేందుకు వైద్య శాఖ కార్యక్రమాలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని కోట్ల మంది నిరుపేద, మధ్యతరగతి ప్రజలకు ఆపద్బాంధవి 'డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ' పథకం అనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. దురదృష్టవశాత్తు అనారోగ్యం బారినపడినా, ప్రమాదానికి గురైనా సదరు వ్యక్తులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ పథకం కింద కార్పొరేట్ ఆస్పత్రుల్లో సైతం ఉచిత వైద్య సేవలను అందిస్తోంది. గత టీడీపీ ప్రభుత్వంలో నిర్వీర్యమైన ఈ పథకానికి సీఎం వైఎస్ జగన్ ఊపిరిలూదారు. వైద్యం ఖర్చు రూ. వెయ్యి దాటే ప్రతి ప్రొసీజర్‌ను పథకం పరిధిలోకి తెచ్చారు. 1,059 నుంచి 3,257కు ప్రొసీజర్స్‌ను పెంచి ప్రజలకు ఆరోగ్య భరోసానిస్తున్నారు. ఇలాంటి పథకం గురించి తెలియక, సేవలు ఎలా వినియోగించుకోవాలో అవగాహన లేక పేద, మధ్యతరగతి ప్రజలు వైద్యం కోసం చేతి నుంచి డబ్బు పెట్టకూడదని ప్రభుత్వం భావించింది. దీంతో రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి పథకం పట్ల పూర్తి అవగాహన కల్పించడం కోసం డిసెంబర్ ఒకటో తేదీ నుంచి ఆరోగ్యశ్రీపై విస్తృత స్థాయి అవగాహన కార్యక్రమానికి వైద్య శాఖ శ్రీకారం చుట్టింది.

ప్రతి ఇంటికీ వైద్య సిబ్బంది

ఇటీవల ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించింది. ఇప్పుడు ఆరోగ్యశ్రీపై విస్తృత అవగాహన కార్యక్రమం చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, ఏఎన్‌ఎంలు ప్రతి ఇంటిని సందర్శిస్తారు. ఆరోగ్యశ్రీ సేవలపై సవివరంగా రూపొందించిన బ్రోచర్‌ను ప్రతి ఇంటిలో అందజేస్తారు. ఏదైనా ఆరోగ్య సమస్య, ప్రమాదం సంభవిస్తే ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా, సులువుగా వైద్య సేవలు ఎలా పొందాలో వివరిస్తారు. తాముంటున్న ప్రాంతానికి చేరువలో ఉన్న నెట్‌వర్క్ ఆస్పత్రులు, ఆయా ఆస్పత్రుల్లో అందే వైద్య సేవల గురించి చెబుతారు. సేవలు వినియోగించుకోవడంలో ఏమైనా సమస్యలు తలెత్తినా, సంతృప్తకర స్థాయిలో సేవలు అందకపోయినా 104కు ఫోన్ చేసి సమాచారం తెలుసుకోవడంతో పాటు, ఎలా ఫిర్యాదులు చేయాలో వివరిస్తారు. ఎక్కడైనా లంచాలు డిమాండ్ చేస్తే 14400కు ఫోన్ చేసి కూడా ఫిర్యాదు చేసేలా చైతన్యం కల్పిస్తారు. చికిత్స అనంతరం విశ్రాంత సమయానికి భృతి అందిస్తున్న ఆరోగ్య ఆసరా గురించి తెలియపరుస్తారు.



అర చేతిలో ఆరోగ్యశ్రీ

ప్రజలకు మరింత సులువుగా పథకం సేవలు అందించడానికి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ యాప్‌ను ప్రభుత్వం రూపొందించింది. ఈ యాప్ ద్వారా ఒనగూరే ప్రయోజనాలను వైద్య సిబ్బంది ప్రజల ఇంటి వద్దే తెలియజేసి వారి స్మార్ట్ ఫోన్‌లో యాప్‌ను ఇన్‌స్టాల్ చేయించి, ఎలా వినియోగించాలో వివరిస్తారు. యాప్ ద్వారా గతంలో చేయించుకున్న చికిత్సల మెడికల్ రిపోర్ట్‌లను భవిష్యత్‌లో ఎప్పుడైనా అవసరమైతే ఎలా పొందవచ్చు, అలాగే ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు సంబంధించిన పూర్తి సమాచారం తెలుసుకోవడాన్ని తెలియపరుస్తారు.

ఒక్కో కుటుంబానికి కనీసం 15 నిమిషాలు



ఆరోగ్యశ్రీ పథకం సేవల గురించి, వాటిని ఏ విధంగా వినియోగించుకోవాలి అనే దానిపై అవగాహన లేని కుటుంబం రాష్ట్రంలో ఉండకూడదు అనేది ప్రభుత్వ లక్ష్యం. ఈ క్రమంలో ప్రతి కుటుంబానికి ఆరోగ్యశ్రీపై అవగాహన కల్పించేలా విస్తృత అవగాహన కార్యక్రమం చేపడుతున్నాం. ఏఎన్‌ఎం, సీహెచ్‌వో ప్రతి కుటుంబానికి కనీసం 15 నిమిషాలు కేటాయించి పథకం సేవలపై అవగాహన కల్పిస్తారు. ప్రత్యేకంగా రూపొందించిన బ్రోచర్‌ను ప్రతి ఇంటికి అందజేస్తారు.

– డాక్టర్ వెంకటేశ్వర్, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సీఈవో

జాతీయ బీసీ కమిషన్ చైర్మన్‌తో బీజేపీ ఎంపీ భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుకాపులు, కళింగ వైశ్యులు, శిష్టకరణాలు, సోండి కులాలకు ఓబీసీ రిజర్వేషన్లు వర్తింపజేయాలని కేంద్రానికి సిఫార్సు చేసినందుకు జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్సరాజ్ అహిర్‌కు బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన హన్సరాజ్ అహిర్‌తో భేటీ అయ్యారు. సమావేశం అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ సిఫార్సు చాలా కీలకమైనదని అన్నారు.

ఏపీపై తుపాను ప్రభావం!

- ఐదారురోజుల్లో విస్తారంగా వర్షాలకు అవకాశం
- డిసెంబర్ 4 నుంచి 6 వరకు భారీ వర్షాలు
- అప్రమత్తం చేసిన భారత వాతావరణ శాఖ
- వరి కోతలు సత్వరమే పూర్తి చేసుకోవాలని సూచన



సాక్షి, విశాఖపట్నం: బంగాళాఖాతంలో ఏర్పడనున్న తుపాను ప్రభావం ఆంధ్రప్రదేశ్‌పై ఉండనుంది. మరో ఐదారు రోజుల్లో రాష్ట్రంలో విస్తారంగా వర్షాలను కురిపించనుంది. ఈ తుపాను ప్రభావం రాష్ట్రంపై స్వల్పంగా ఉంటుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తొలుత అంచనా వేసింది. ఆగ్నేయ బంగాళాఖాతం నుంచి పశ్చిమ మధ్య బంగాళాఖాతం చేరువ వరకే తుపాను గమ్యాన్ని తెలిపే సైక్లోన్ ట్రాక్ పరిమితం కావడంతో ఈ నిర్ధారణకు వచ్చింది. దీంతో రాష్ట్రంలో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలకే వాతావరణం పరిమితమవుతుందని పేర్కొంది. కానీ మంగళవారం నాటికి పరిస్థితిలో ఒకింత మార్పు కనిపించింది. సోమవారం దక్షిణ అండమాన్ సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం మంగళవారం కూడా ఆ ప్రాంతంలోనే కొనసాగుతోంది. ఐఎండీ ముందస్తు నివేదిక ప్రకారం ఈ అల్పపీడనం బుధవారానికే వాయుగుండం గాను, డిసెంబర్ ఒకటిన తుపాను గాను బలపడాల్సి ఉంది. కానీ అందుకు భిన్నంగా ఒక రోజు ఆలస్యంగా గురువారం నాటికి వాయుగుండంగా, డిసెంబర్ 2న తుపానుగా మారనుంది. ఇది కోస్తాంధ్ర తీరానికి సమీపంలోకి రాకపోయినా దాని ప్రభావం మాత్రం రాష్ట్రంపై ఉంటుందని ఐఎండీ అంచనా వేస్తోంది. ఫలితంగా డిసెంబర్ 4, 5, 6 తేదీల్లో కోస్తాంధ్ర, రాయలసీమల్లో పలు చోట్ల విస్తారంగా, కొన్నిచోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం డైరెక్టర్ ఎస్.స్టెల్లా తెలిపారు. భారీ వర్షాలకు వరితో పాటు ఇతర పంటలు దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల కోతకు వచ్చిన వరి పంటను వెనువెంటనే కోసి భద్రపరచుకోవాలని రైతులకు సూచించారు. అవసరమైన చర్యలు చేపట్టాలని ఆమె రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్రమత్తం చేశారు. ఒకవేళ తుపాను కోస్తాంధ్ర వైపు పయనిస్తే వర్షాల తీవ్రత మరింత పెరుగుతుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. వర్షాలకు ఈదురుగాలులు తోడై పంటలకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తాయని పేర్కొంటున్నారు. కాగా, రానున్న మూడు రోజులు కోస్తాంధ్రలో ఒకటి రెండు చోట్ల, రాయలసీమలో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది.

సీనియర్ ఐఏఎస్‌లకు జైలుశిక్ష.. జరిమానా

- డిసెంబర్ 8లోపు లొంగిపోవాలని శ్యామలరావు, పోలా భాస్కర్‌కు హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: కోర్టు ధిక్కార కేసులో ఇద్దరు సీనియర్ ఐఏఎస్‌లకు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ హైకోర్టు మంగళవారం తీర్పు వెలువరించింది. కోర్టు ఆదేశాలను అమలు చేయనందుకు ఉన్నత విద్యాశాఖ ప్రస్తుత ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావు, కాలేజీ విద్య ప్రస్తుత కమిషనర్ పోలా భాస్కర్‌కు నెల రోజుల సాధారణ జైలు శిక్ష, రూ.1,000 చొప్పున జరిమానా విధించింది. జైలుశిక్ష అనుభవించేందుకు వీలుగా డిసెంబర్ 8వ తేదీ లోపు హైకోర్టు రిజిస్ట్రార్ (జ్యుడీషియల్) ముందు లొంగిపోవాలని ఇద్దరు అధికారులను ఆదేశించింది. లొంగిపోయిన తరువాత వారిని నిబంధనల ప్రకారం జైలుకు పంపేందుకు తగిన చర్యలు తీసుకోవాలని రిజిస్ట్రార్‌ను ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కుంభజడల మన్మథరావు తీర్పు వెలువరించారు.

ఇదీ కారణం

అన్ ఎయిడెడ్ లెక్చరర్లుగా పనిచేస్తున్న తమను ఖాళీ పోస్టుల్లోకి తీసుకునేందుకు నిరాకరిస్తూ కాలేజీ విద్య కమిషనర్ జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ పలువురు 2012, 2013, 2014, 2016 సంవత్సరాల్లో హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలన్నింటిపై న్యాయమూర్తి జస్టిస్ మన్మథరావు విచారణ జరిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి 2022 జూలైలో తీర్పు వెలువరిస్తూ.. పిటిషనర్ల మాదిరిగానే గ్రాంట్ ఇన్ ఎయిడ్ పోస్టుల్లో పనిచేస్తున్న వారిని ప్రభుత్వమే విలీనం చేసుకుందని, అయితే పిటిషనర్లను మాత్రం విలీనం చేసుకునేందుకు నిరాకరించడం సరికాదని స్పష్టం చేశారు. పిటిషనర్లను ఖాళీగా ఉన్న అన్ ఎయిడెడ్ లెక్చరర్ల పోస్టుల్లోకి తీసుకునేందుకు నిరాకరిస్తూ కాలేజీ విద్య కమిషనర్ జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేశారు. ఖాళీగా ఉన్న అన్ ఎయిడెడ్ పోస్టుల్లోకి పిటిషనర్లను విలీనం చేసుకోవాలని కమిషనర్‌ను ఆదేశించారు. హైకోర్టు ఇచ్చిన ఈ ఆదేశాలను అధికారులు అమలు చేయలేదంటూ వారిపై కోర్టు ధిక్కార పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై జస్టిస్ మన్మథరావు విచారణ జరిపారు. అనంతరం ప్రధాన తీర్పును సమీక్షించాలని కోరుతూ అధికారులు రివ్యూ పిటిషన్‌లు దాఖలు చేశారు. ఈ రివ్యూ పిటిషన్లపై విచారణ జరిపిన న్యాయమూర్తి జస్టిస్ మన్మథరావు వాటిని కొట్టేస్తూ గత నెల 31న తీర్పు వెలువరించారు. అనంతరం కోర్టు ధిక్కార పిటిషన్లపై న్యాయమూర్తి విచారణ జరిపారు. కొందరు పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది పి.గంగయ్య నాయుడు వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి మంగళవారం తీర్పు వెలువరించారు. ఖాళీగా ఉన్న అన్ ఎయిడెడ్ పోస్టుల్లోకి పిటిషనర్లను విలీనం చేసుకోవాలన్న కోర్టు ఆదేశాలను అధికారులు ఉల్లంఘించారని న్యాయమూర్తి తేల్చారు.


మేలుజాతి దూడల పెంపకానికి చేయూత



శిబిరాన్ని ప్రారంభిస్తున్న జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి హనుమంతరావు

చీరాల టౌన్: పాడిపరిశ్రమలో పశుపోషకులు ఆర్థికంగా వృద్ధి చెందేందుకు మేలుజాతి దూడల పెంపకానికి ప్రభుత్వం చేయూతనందిస్తుందని బాపట్ల జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి డాక్టర్ మద్దు హనుమంతరావు అన్నారు. మంగళవారం మండలంలోని ఈపురుపాలెం పంచాయతీలోని సావరపాలెం గ్రామంలో పశువైద్యురాలు డాక్టర్ పావని ఆధ్వర్యంలో పశుపోషకులకు మేలుజాతి దూడల ప్రదర్శన, దూడల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు, శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన హనుమంతరావు మాట్లాడుతూ పాడిపంటలు అన్నదాతలకు రెండు కళ్లన్నారు. పాడి పరిశ్రమలో వృద్ధితో పాటుగా ఆర్థికాభివృద్ధి చెందాలంటే మేలుజాతి దూడలను పోషించడంతో పాటుగా సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమానికి హాజరైన ఒంగోలు ఈవోడీఎల్‌డీఏ డాక్టర్ కాలేషా పెయ్యి దూడల ఉత్పత్తి పథకాల గురించి, స్వచ్ఛమైన పాల ఉత్పత్తికి పశువులను అందించాల్సిన దాణా, ప్రభుత్వం అందిస్తున్న పశువైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ప్రదర్శనలో ప్రతిభచూపిన మేలుజాతి దూడల యాజమానులకు బహుమతులు అందించారు. అలానే దూడలకు నట్టల నివారణ మందులు, కాల్షియం పెంచే ద్రావణాలను అందించారు. కార్యక్రమంలో చీరాల ఏడీఏ డాక్టర్ ఎస్.చిట్టిబాబు, పశువైద్యాధికారులు పావని, రవికుమార్, సిబ్బంది, పాడి రైతులు, పశుపోషకులు పాల్గొన్నారు.

బోడవాడలో చైన్ స్నాచింగ్



వృద్ధురాలిని విచారిస్తున్న పోలీసులు

పర్చూరు (చినగంజాం): మండలంలోని బోడవాడ గ్రామంలో చైన్ స్నాచింగ్ కలకలం సృష్టించింది. ఇంట్లో మంచంపై కూర్చొని ఉన్న పుల్లెల సరోజిని అనే 82 ఏళ్ల వృద్ధురాలి వద్దకు మంగళవారం సాయంత్రం ఇద్దరు యువకులు వచ్చారు. ఆ సమయంలో ఆమె భర్త సత్యనారాయణ వాకింగ్ కోసం బయటకు వెళ్లారు. యువకులు వృద్ధురాలితో మాయమాటలు చెప్పి ఆమె మెడలో ఉన్న ఏడు సవర్ల బంగారు గొలుసుని లాక్కొని పరారయ్యారు. వృద్ధురాలు తేరుకొని కేకలు వేసే సరికి యువకులు వేగంగా పరుగెత్తుకుంటూ వెళ్లిపోయారు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని బాధితురాలి నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆమె భర్త సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదుతో విచారణ చేస్తున్నట్లు ఎస్సై రవి శంకర్‌రెడ్డి తెలిపారు.

రాష్ట్రస్థాయి కబడ్డీలో ప్రసన్నకు కాంస్యం



ప్రసన్నను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చీరాల అర్బన్: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో ఈపూరుపాలెం జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని కాంస్య పతకం సాధించింది. చీరాల రూరల్ మండలం ఈపూరుపాలెం జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న గడ్డం ప్రసన్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొని కాంస్య పతకం సాధించిందని ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎస్.పద్మజ మంగళవారం తెలిపారు. చిత్తూరు జిల్లా చౌడేపల్లిలో జరిగిన పోటీల్లో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు ఎన్.రోజ్ హెల్మాను, విద్యార్థినిని ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

సాక్షి బాపట్ల

బుధవారం ı 29 ı నవంబర్ ı 2023




సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 524.20 అడుగుల వద్ద ఉంది. ఎడమ కాలువకు 3,202 క్యూసెక్కులు విడుదలవుతోంది.



యార్డుకు 41,609 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): మార్కెట్ యార్డుకు మంగళవారం 41,609 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 40,670 బస్తాలు అమ్మకాలు జరిగాయి.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద మంగళవారం 716 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాల్వకు 760 క్యూసెక్కులు వదిలారు.

న్యూస్‌రీల్

గురుకుల పాఠశాలలో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

చిలకలూరిపేటటౌన్: ఏపీ బాలుర గురుకుల పాఠశాలలో తాత్కాలిక ప్రాతిపదికన పనిచేయటానికి వివిధ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. రాజాపేట గురుకుల పాఠశాలలో పనిచేయటానికి పీజీటీ ఫిజికల్ సైన్స్, పీజీటీ ఇంగ్లిషు పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ పోస్టులకు ఎమ్మెస్సీ బీఈడీ , ఎంఏ బీఈడీ అర్హత కలిగి ఉండాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో స్కూల్ ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని కోరారు. పురుష అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు.

నేడు చిన్నగంజాంలో జగనన్నకు చెబుదాం

బాపట్ల: జగనన్నకు చెబుదాం ప్రత్యేక స్పందన కార్యక్రమం మండల కేంద్రం చిన్నగంజాంలో బుధవారం జరుగుతుందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఒక ప్రకటనలో తెలియజేశారు. జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం బుధవారం మధ్యాహ్నం 2.30 గంటలకు చిన్నగంజాంలోని వెంకటేశ్వర కల్యాణ మండపంలో జరుగుతుందన్నారు. మండలంలోని ప్రజలందరూ వినియోగించుకోవలసిందిగా కలెక్టర్ తెలిపారు.

ఓటు హక్కు కోసం యువత ముందుకు రావాలి

గుంటూరు జాయింట్ కలెక్టర్ రాజకుమారి

గుంటూరు వెస్ట్ : ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, విద్యాలయాలు, విశ్వవిద్యాలయాల్లోని యువత ఓటు హక్కు నమోదుకు ముందుకు రావాలని, అధికారులు దీనిపై అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరం నుంచి నిర్వహించిన సమావేశంలో జేసీ మాట్లాడుతూ స్పెషల్ సమ్మరీ రివిజన్-2024లో భాగంగా జిల్లాలోని స్వీప్ నోడల్ అధికారులు, ఈఆర్వో, ఏఈఆర్వోలు విద్యాలయాలకు వెళ్లి సిబ్బందితో, విద్యార్థులతో సమావేశం నిర్వహించాలన్నారు. యువతను తప్పకుండా ఓటరుగా చేర్పించే విధంగా కృషి చేయాలన్నారు. దీనికి సంబంధించి సాంస్కృతిక కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహించాలన్నారు. జనవరి 1, 2024న ఓటర్ల తుది జాబితా ప్రచురిస్తారని పేర్కొన్నారు.

సమగ్ర శిక్షలో ఏపీఓ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు ఎడ్యుకేషన్ : గుంటూరు జిల్లా సమగ్రశిక్షలో అసిస్టెంట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ (ఏపీవో)గా ఫారెన్ సర్వీసు నిబంధనలు అనుసరించి, డెప్యూటేషన్‌పై పని చేసేందుకు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు డిసెంబర్ 4వ తేదీలోపు దరఖాస్తు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 30 నాటికి 50 ఏళ్లలోపు వయసు కలిగిన మ్యాథ్స్, స్టాటిస్టిక్స్, ఫిజికల్ సైన్స్ సబ్జెక్టుల్లో పీజీలో ద్వితీయ శ్రేణి ఉత్తీర్ణతతో పాటు ఎంసీఏ, పీజీ డిప్లొమా ఇన్ కంప్యూటర్ అప్లికేషన్స్ అర్హతలు గల స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు విద్యార్హతలకు సంబంధించిన జిరాక్స్, ఇతర ధ్రువపత్రాలపై సంబంధిత అధికారి సంతకంతో డీఈవో కార్యాలయంలోని సమగ్రశిక్ష విభాగంలో అందజేయాలని సూచించారు. గతంలో సమగ్రశిక్షలో మూడేళ్లపాటు పని చేసిన పక్షంలో తిరిగి దరఖాస్తు చేసేందుకు ఆర్నెల్లు పీరియడ్ పైబడి ఉండాలని స్పష్టం చేశారు. వివరాలకు సమగ్ర శిక్ష కార్యాలయంతోపాటు సమగ్రశిక్ష గుంటూరు.బ్లాగ్‌స్పాట్.కామ్ సైట్ సందర్శించాలని తెలిపారు.

12 మందికి ఎస్‌ఐలుగా ఉద్యోగోన్నతి

నగరంపాలెం: గుంటూరు రేంజ్‌లో 12 మంది ఏఎస్‌ఐలకు ఎస్‌ఐలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు ఉత్తర్వులు జారీచేశారు. ఏఎస్‌ఐలుగా విధులు నిర్వహిస్తున్న టి.మోహనరావు, జీసీఎం.దాస్, (ఎస్‌పీఎస్ నెల్లూరుజిల్లా), ఎం.పోలురాజు, జి.మురళీధర్‌రావు, ఎస్.మరియదాస్, (ప్రకాశం జిల్లా), ఇ.శ్రీనివాసరావు, జి.మీరావలి, పి.శ్యామలాదేవి, ఎం.బ్రహ్మయ్య (గుంటూరు రూరల్), ఎస్.రవికుమార్, టి.నరేంద్రకుమార్ (గుంటూరు జిల్లా), హెడ్‌కానిస్టేబుల్ (హెచ్‌సీ) పి.శ్రీనివాస రావు (ప్రకాశం జిల్లా) ఎస్‌ఐలుగా ఉద్యోగోన్నతి పొందిన వారిలో ఉన్నారు.

నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయల కనిష్ఠ ధర రూ.2,000, గరిష్ఠ ధర రూ.2,900, మోడల్ ధర రూ.2,400 వరకు పలికింది.

వచ్చేనెల 15 వరకు సాగునీరు

- ఆలస్యంగా వేసిన ఖరీఫ్ పంటలకూ సరఫరా
- రబీకి గడ్డు పరిస్థితే
- కలెక్టర్ రంజిత్‌బాషా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా, చిత్రంలో ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల: వర్షాభావం నేపథ్యంలో రబీ సీజన్‌కు సాగునీరు అందించలేని పరిస్థితులు నెలకొన్నాయని కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. నీటి పారుదల సలహా మండలి జిల్లాస్థాయి సమావేశం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో మంగళవారం జరిగింది. పశ్చిమ కృష్ణా డెల్టా పరిధిలో ఆలస్యంగా వేసిన ఖరీఫ్ వరి పంట రక్షణకు మాత్రమే డిసెంబర్ 15 వరకు నీరు అందిస్తామని కలెక్టర్ చెప్పారు. చీరాల సబ్ డివిజన్ పరిధిలోని కారంచేడు, చీరాల, చినగంజాం, వేటపాలెం మండలాలకు మాత్రమే వారాబందీ విధానంలో సాగునీరు విడుదల చేస్తామన్నారు. గడ్డు పరిస్థితుల్లోనూ రైతులకు మేలు చేసేలా జిల్లా యంత్రాంగం పనిచేస్తోందని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. రైతుల కోసం బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి ప్రత్యేకంగా పెద్ద మోటార్లు ఏర్పాటు చేశారని తెలిపారు. రబీలో వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. నాగార్జున సాగర్, పశ్చిమ కృష్ణా డెల్టా పరిధిలోని ఆయకట్టు భూములలో ప్రత్యామ్నాయ పంటల కింద పొగాకు, మినుము, పెసలు పంటలు వేసుకోవాలన్నారు. బావులు, బోర్ల సౌకర్యం ఉంటే వాటి కింద మొక్కజొన్న, జొన్న పంటలు వేసుకోవచ్చన్నారు. బోర్లు, బావుల సౌకర్యం లేని భూములలో మినుము పెసర వేసుకోవాలని సూచించినట్లు తెలిపారు. పశ్చిమ కృష్ణా డెల్టా 17 మండలాలలో 3,79,997 ఎకరాలు ఆయకట్టు భూములు సాగులో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. అలాగే నాగార్జునసాగర్ కెనాల్ కింద 11 మండలాలలో 1,69,246 ఎకరాలు సాగవుతున్నాయని వివరించారు. 40 మైనర్ ఇరిగేషన్ పథకాల కింద 8,381.83 ఎకరాల భూమి సాగుతుందని, 19 మండలాలలో 93 ఎత్తిపోతల పథకాల కింద 1,13,332 ఎకరాల భూమి ఉందన్నారు. 35 మేజర్ కాల్వలు, మరో 49 మైనర్ కాలువలు ఉన్నాయని వివరించారు.

తాగునీరు జనవరి, మార్చిలో విడుదల

తాగునీటి అవసరాల కోసం జనవరి, మార్చి నెలలో నీరు విడుదల కానుందని, వాటితో నూరు శాతం చెరువులన్నింటినీ అధికారులు నింపాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా చెప్పారు. తాగునీటి సమస్య తలెత్తకుండా జల వనరుల శాఖ, ఆర్ డబ్ల్యూఎస్ అధికారులు ప్రణాళికలు రూపొందించుకోవాలని చెప్పారు. రానున్న వేసవిలోనే సాగనీటి కాలువల మరమ్మతులు, నిర్వహణ పనులు చేపట్టేలా ప్రతిపాదనలు డిసెంబర్‌లోనే ప్రభుత్వానికి పంపాలన్నారు. సమగ్ర ప్రణాళికతో అధికారులు పని చేస్తే రైతుల సమస్యలు సులభంగా పరిష్కరించవచ్చన్నారు.

రైతులకు నష్టం జరగకుండా చూడాలి : ఎమ్మెల్యే కోన రఘుపతి

వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులకు నష్టం జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి కోరారు. ప్రాజెక్టులు, ఎగువ ప్రాంతాలలో నీరు లేనందున రబీ సీజన్‌కు నీరు విడుదలయ్యే పరిస్థితి కనిపించడం లేదన్నారు. ఈ విషయాన్ని రైతులు గమనించి వరికి బదులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపాలన్నారు. రైతులకు అవగాహన కల్పించాలన్నారు. నీటిని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు మేలు చేయడమే లక్ష్యంగా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. సమావేశంలో జల వనరుల శాఖ ఎస్ఈ మురళీకృష్ణ, ఇంజనీరింగ్ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

తీరానికి వరాల బాట

- వాడరేవు నుంచి చిలకలూరిపేట వరకు జాతీయ రహదారి
- నాలుగులేన్ల నిర్మాణానికి రూ.825.76 కోట్లతో అంచనాలు
- గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన కేంద్రం
- జనవరి నుంచి నిర్మాణ పనులు



సాక్షి ప్రతినిధి,బాపట్ల : తీరప్రాంతంలో పర్యాటకాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం అన్నిరకాల చర్యలూ తీసుకుంటోంది. ఇందుకోసం ప్రత్యేక ప్రణాళికతో ముందడుగు వేస్తోంది. రహదారులను తీరానికి అనుసంధానిస్తే త్వరగా అభివృద్ధి చెందే ఆస్కారం ఉంటుందని భావించిన ప్రభుత్వం మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు సిద్ధమైంది. దీనికోసం కేంద్రప్రభుత్వాన్ని ఒప్పించి చీరాల వాడరేవు ప్రాంతానికి నాలుగులేన్ల రహదారిని నిర్మించనుంది.

భూసేకరణకు గ్రామసభలు

జాతీయ రహదారి అభివృద్ధికి అవసరమైన భూసేకరణ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. వాడరేవు తీరప్రాంతంలో సర్వేచేసి ఇప్పటికే కొంత భూసేకరణ చేశారు. ఇందుకోసం సర్వే చేసి హద్దులు నిర్ణయించి, రైతుల వారీగా భూమిని సేకరించనున్నారు. ఇందుకోసం గ్రామ సభలు నిర్వహించారు. రైతులకు పరిహారం చెల్లించేందుకు అవార్డు జారీ చేస్తున్నారు. ఈ మేరకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. భూమికి సంబంధించిన పత్రాలు, ఆధార్, బ్యాంకు ఖాతాలకు సంబంధించిన నకలు పత్రాలు, ఈసీ, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు సైతం రైతుల నుంచి సేకరిస్తున్నారు. జనవరి మొదటి వారం లోపు భూసేకరణ పూర్తి చేయనున్నారు.

47 కిలోమీటర్ల మేర..

వాడరేవు నుంచి చిలకలూరిపేట వరకు 47 కిలోమీటర్ల మేర నాలుగులేన్లుగా రోడ్డును విస్తరించనున్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.825.76 కోట్లు కేటాయించింది. ఈ ఏడాది జూన్‌లో కేంద్ర ఉపరి తల రవాణా శాఖ, జాతీయ రహదారుల సంస్థ ఈ మేరకు టెండర్లు పిలిచింది. రాజేంద్రసింగ్ భాంబూ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ అంచనా విలువ కన్నా 17.91 శాతం తక్కువకు టెండర్ వేసి పనులు దక్కించుకుంది. గుత్తేదారుకు జాతీయ రహదారుల సంస్థ భూమిని స్వాధీనం చేయాల్సి ఉంది. జిల్లా పరిధిలో దాదాపు 100 హెక్టార్లు, పల్నాడు జిల్లాలో (అన్నం బొట్లవారి పాలెం నుంచి చిలకలూరిపేట వరకు) సుమారు 40 హెక్టార్ల భూసేకరణ చేయనున్నారు. రహదారి విస్తరణకు అవసరమైన భూమిని స్వాధీనం చేసుకున్న అనంతరం రెండేళ్లలో రహదారి నిర్మాణం పనులు పూర్తి చేయాలి. ఈ పనులు జనవరిలో ప్రారంభమయ్యే అవకాశం ఉందని జాతీయ రహదారుల సంస్థ అధికారులు తెలిపారు.

ఖరీఫ్ ధాన్యం కొనుగోలు సజావుగా చేపట్టాలి

గుంటూరు జాయింట్ కలెక్టర్ రాజకుమారి

గుంటూరు వెస్ట్: ఖరీఫ్ ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా, సక్రమంగా నిర్వహించేందుకు అధికారులు సమష్టి కృషితో పనిచేయాలని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి సూచించారు. మంగళవారం రాత్రి స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో జేసీ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో 55,454 హెక్టార్లలో రైతులు వరి సాగు చేశారని పేర్కొన్నారు. సుమారు మూడు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చిందని చెప్పారు. ప్రభుత్వం 75 కేజీల ఏ గ్రేడ్ బస్తాకు రూ.1,652.25, సాధారణ రకానికి రూ.1,637.27 మద్దతు ధర ప్రకటించిందన్నారు. ప్రస్తుతం జిల్లాలో వరికోతలు ప్రారంభమయ్యాయని వెల్లడించారు. డిసెంబరు మొదటివారం నుంచే ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంటుంది కాబట్టి ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేయాలన్నారు. 163 రైతు భరోసా కేంద్రాల పరిధిలో 65 క్లస్టర్లుగా విభజించి మ్యాపింగ్ చేశామన్నారు. ధాన్యం కల్లంలోనే కొనుగోలు చేసి ఆర్‌బీకే కేంద్రం వద్దకు రైతుకు ఎఫ్‌డీఓ అందించి మిల్లుకు తరలిస్తామన్నారు. మద్దతు ధర కంటే తక్కువ ధరకు విక్రయించుకోవద్దని పేర్కొన్నారు. ఈ-క్రాప్‌లో నమోదైన వివరాల ప్రకారం కొనుగోలు జరుగుతోందని చెప్పారు. నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం గన్నీ బ్యాగులు, లేబర్, ట్రాన్స్‌పోర్టు వివరాలు యాప్‌లో నమోదు చేసి పొలంలోని కల్లం వద్దనే ధాన్యం ప్యాకింగ్ చేసి జీపీఎస్ వాహనాల్లో లోడింగ్ చేయాలన్నారు. జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని పేర్కొన్నారు. దళారులు రైతులను మోసగించేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తప్పవని జేసీ హెచ్చరించారు. సమావేశంలో తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లు, డీఎస్ఓ కోమలి పద్మ అధికారులు పాల్గొన్నారు.

రికార్డులు తగులబెట్టిన జూనియర్ అసిస్టెంట్



ఘటనపై విచారణ జరుపుతున్న ఎస్ఐ నాయబ్ రసూల్

ఇంకొల్లు (చినగంజాం): గ్రామ పంచాయతీలో రికార్డులను జూనియర్ అసిస్టెంట్ తగులబెట్టిన ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ ఎస్‌కే నాయబ్ రసూల్ వివరాల మేరకు.. సోమవారం రాత్రి 8.26 గంటల ప్రాంతంలో ఇంకొల్లు పంచాయతీ కార్యాలయంలో మంటల చెలరేగుతున్నట్లు ఈఓపీఆర్డీ శ్రీనివాసరావుకు స్థానికులు సమాచారం అందించారు. ఆయన ఘటనా స్థలానికి వచ్చి చూడగా రికార్డులు తగులబడుతుండటంతో వెంటనే ఆర్పివేసి మంటలను అదుపులోకి తీసుకు వచ్చారు. శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు చుట్టుపక్కల విచారణ జరుపగా కార్యాలయంలోని జూనియర్ అసిస్టెంట్ చైతన్య సోమవారం రాత్రి పెట్రోలు తీసుకొని వచ్చి రికార్డులను తగులబెట్టినట్లు తేలింది. పాక్షికంగా ఫైళ్లు తగులబడినట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చైతన్య కోసం గాలిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పూలే ఆశయ సాధనకు పునరంకితం కావాలి

కలెక్టర్ పి.రంజిత్‌బాషా



జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా, ఎమ్మెల్యే కోన రఘుపతి



మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్ల: సాంఘిక దురాచారాలు, అసమానతలపై మహాత్మా జ్యోతిరావు పూలే ఎనలేని పోరాటాలు చేశారని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి కార్యక్రమం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి స్థానిక ఆర్టీసీ డిపో ఎదురుగా ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహానికి పుష్పమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జ్యోతిరావు పూలే ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని అన్నారు. పేదల అభ్యున్నతికి మనమంతా కలిసి కృషి చేయాలన్నారు. సత్యసమాజాన్ని స్థాపించడం కోసం పూలే చేసిన కృషి అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ కులమతాలకతీతంగా ప్రజలందరికీ సమాన అవకాశాలు రావాలని చైతన్య ఉద్యమం చేసిన మహనీయులు మహాత్మా జ్యోతిరావు పూలే అని అన్నారు. పూలే ఆశయాలను కొనసాగించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ ఇన్‌చార్జి అధికారి బి.అర్జునరావు, పర్యవేక్షకులు రమేష్, నాయకులు చేజర్ల నారాయణరెడ్డి, నర్రావుల వెంకట్రావు, జోగి రాజా, ఉప్పాల మురళి, బాపట్ల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాతృ మరణాలు తగ్గించడానికి చర్యలు తీసుకోవాలి

బాపట్ల: జిల్లాలో మాతృ మరణాలు తగ్గించడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో మాతృ మరణాలపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా మాట్లాడుతూ జిల్లాలో మాతృ మరణాలు తగ్గించడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో మాతృ మరణాలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి నివేదికలు ఇవ్వాలని చెప్పారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ హాస్పిటల్స్‌ను తనిఖీలు చేపట్టాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో మాతృ మరణాలు జరిగిన హాస్పిటల్స్ వైద్యులను సమావేశానికి హాజరు కావాలని చెప్పారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి విజయమ్మ, డిస్ట్రిక్ట్ హాస్పిటల్ కో ఆర్డినేటర్ శశికుమార్, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి ఉమా, డాక్టర్ సునీతా, రామకృష్ణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు పాల్గొన్నారు.

పూలే స్ఫూర్తితో ముందుకుపోవాలి

బాపట్లటౌన్: మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ సమ సమాజ స్థాపనకు కృషి చేయాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పేర్కొన్నారు. మంగళవారం మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా మంగళవారం ఎస్పీ కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పూలే సమాజానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ పి.మహేష్, అడ్మిన్ ఆర్ఐ ఎల్.మన్మథరావు, వెల్ఫేర్ ఆర్ఐ బి.శ్రీకాంత్ నాయక్, హోంగార్డ్స్ ఆర్ఐ ఎల్.గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కన్నకొడుకే కడతేర్చాడు

అర ఎకరం పొలం కోసం తల్లిని నరికి చంపిన కొడుకు



హత్యకు గురైన నక్కల వెంకటరత్నం



ఘటన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న సీఐ సోమశేఖర్

చీరాల టౌన్: అర ఎకరం పొలం కోసం నవమాసాలు మోసి కనిపెంచిన తల్లిని కర్కశంగా నరికి దారుణానికి ఒడిగట్టాడు ఓ కొడుకు. బాపట్ల జిల్లా చీరాల మండలం పుల్లాయపాలెం వద్ద మంగళవారం ఈ ఘటన జరిగింది. రూరల్ ఎస్సై పి.జనార్దన్ కథనం ప్రకారం.. గవినివారిపాలెం పంచాయతీ పుల్లాయిపాలేనికి చెందిన నక్కల వెంకటరత్నం(59)కు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కుమార్తెను వేటపాలెం మండలం బచ్చులవారిపాలెంలో తన మేనల్లుడికే ఇచ్చి పెళ్లి చేసింది. తనకు ఉన్న 3.5 ఎకరాల పొలంలో కూతురికి ఒక ఎకరం రాసిచ్చింది. పుల్లాయిపాలెంలో ఇల్లు కట్టుకునే సమయంలో సుమారు రూ.5 లక్షల వరకు అప్పులు అయ్యాయి. అర ఎకరం పొలం అమ్మి బాకీలు తీరుస్తానని తల్లి వెంకటరత్నం చెబుతోంది. ఆ విషయం పెద్ద కుమారుడు శివయ్యకు ఇష్టం లేదు. పొలం తనకే చెందాలంటూ కొద్ది రోజులుగా తల్లీకొడుకుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం వేరుశనగపప్పు అమ్ముకునేందుకు వెళ్తున్న తల్లి వెంకటరత్నానికి చీరాలలో విడిచిపెడతానని మాయమాటలు చెప్పి బైక్‌పై ఎక్కించుకుని పుల్లాయిపాలెం దాటగానే వెంట తెచ్చుకున్న కత్తితో ఆమె మెడపై విచక్షణారహితంగా దాడిచేశాడు. ఘటన స్థలంలోనే తల్లి నిర్జీవంగా పడిపోయింది. వెంటనే శివయ్య పరారయ్యాడు. గ్రామస్తుల సమాచారంతో రూరల్ ఇన్‌చార్జి సీఐ జి.సోమశేఖర్, ఎస్సై పి.జనార్దన్, సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసును ఇన్‌చార్జి సీఐ సోమశేఖర్ దర్యాప్తు చేస్తున్నాడు. శివయ్యను రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు సమాచారం. బుధవారం మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచనున్నారు.

చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యం

- ఎమ్మెల్సీ కె.కల్పలతా రెడ్డి
- ముగిసిన రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు
- విజేతలుగా బాలుర విభాగంలో ప్రకాశం, బాలికల విభాగంలో శ్రీకాకుళం



బాలుర విభాగంలో విజేతగా నిలిచిన ప్రకాశం జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి, డీఎస్పీ కె.వి.మాధవ్



బాలికల విభాగంలో విజేతగా నిలిచిన శ్రీకాకుళం జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి, డీఎస్పీ మాధవ్

నరసరావుపేట రూరల్: రాష్ట్రంలో విద్యతోపాటు క్రీడలకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఎమ్మెల్సీ కె.కల్పలతారెడ్డి తెలిపారు. లింగంగుంట్ల శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో మూడు రోజుల పాటు నిర్వహించిన 33వ అంతర జిల్లాల బాలబాలికల సబ్ జూనియర్ ఖోఖో పోటీలు మంగళవారం ముగిశాయి. బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న కల్పలతారెడ్డి మాట్లాడుతూ పేదరికం కారణంగా విద్యకు దూరంగా కాకూడదనే ఉద్దేశ్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభ గల క్రీడాకారులను గుర్తించి వారికి ప్రోత్సహించేందుకు ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. క్రీడల ద్వారా మంచి ఆరోగ్యం, ఏకాగ్రత లభిస్తుందన్నారు. ఓటమికి కుంగిపోకుండా విజయం కోసం కృషిచేయడం మనకు క్రీడల ద్వారా అలవడుతుందని తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి కె.శామ్యూల్ మాట్లాడుతూ సమష్టిగా పనిచేసి క్రీడలను విజయవంతం చేసిన శంకర భారతీపురం జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులను అభినందించారు. ప్రాచీన గ్రామీణ క్రీడ అయిన ఖోఖోకు ఆదరణ లభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. గ్రామీణ నేపథ్యం ఉన్న జట్లే ఈ పోటీలలో విజయం సాధించడం ఇందుకు నిదర్శనమన్నారు. రాష్ట్ర జట్టు ఎంపిక విషయంలో ప్రతిభే కొలమానంగా తీసుకుని నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సెలక్షన్ కమిటీ సభ్యులకు సూచించారు. డీఎస్పీ కె.వి.మాధవ్ మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు ఎంతో ముఖ్యమని తెలిపారు. చదువు ద్వారా జ్ఞానాన్ని సంపాదిస్తే, క్రీడల ద్వారా వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు అలవడుతాయని తెలిపారు. స్నేహభావంతో తోటివారితో ఎలా ఉండాలో క్రీడలు నేర్పుతాయని, దీనిని జీవితంలో మరిచిపోవద్దని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.పార్వతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ రామ్‌కుమార్, ఎంఈఓ నాగేశ్వరరావు, రొంపిచర్ల జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు సుభాని, పోటీల కో-ఆర్డినేటర్ ఝాన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు..

అంతర జిల్లాల ఖోఖో పోటీల్లో ఫైనల్ పోటీలు మంగళవారం సాయంత్రం నిర్వహించారు. బాలుర విభాగంలో కర్నూలు-ప్రకాశం జిల్లాలు ఫైనల్‌లో తలపడగా ప్రకాశం జట్టు విజయం సాధించి ప్రథమ స్థానాన్ని సాధించింది. కర్నూలు ద్వితీయ స్థానం, గుంటూరు, విజయనగరం జిల్లాలకు ఉమ్మడిగా తృతీయస్థానం సాధించాయి. బాలికల విభాగంలో శ్రీకాకుళం, చిత్తూరు జిల్లాల జట్లు ఫైనల్ పోటీలో పోటీ పడ్డాయి. ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో శ్రీకాకుళం గెలుపొంది ప్రథమస్థానాన్ని కైవసం చేసుకుంది. ద్వితీయ స్థానాన్ని చిత్తూరు, విశాఖపట్నం, తూర్పుగోదావరి జట్లు ఉమ్మడిగా తృతీయ స్థానాన్ని పొందాయి.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య

వేటపాలెం: ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు అర్ధంతరంగా తనువు చాలించాడు. ఈ ఘటన మండలం కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. పందిళ్లపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో గాదె వంశీకృష్ణ (21) నివాసం ఉంటున్నాడు. డిగ్రీ వరకు చదువుకున్నాడు. ఈ క్రమంలో కారును కొనుగోలు చేసి అద్దెలకు తిప్పుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. అయితే కారు వాయిదాలు చెల్లించకపోవడంతో అప్పులు ఎక్కువయ్యాయని సమాచారం. కొన్నేళ్ల క్రితం వంశీకృష్ణ తల్లిదండ్రులు ఇద్దరూ మరణించారు. తన అవ్వతాతల దగ్గరే ఉంటున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో సోమవారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగళవారం కుటుంబసభ్యులు చూసి పోలీసులకు సమచారం అందించారు. ఎస్సై జీ సురేష్ ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నక్కను ఢీకొట్టి ఆటో బోల్తా

భార్య మృతి, భర్తకు గాయాలు

అద్దంకి: నక్కను తప్పించబోయి అదుపుతప్పి ఆటో బోల్తా కొట్టడంతో భార్య మృతి చెందగా భర్తకు గాయాలయ్యాయి. ఈఘటన అద్దంకి పట్టణ శివారులోని నల్లవాగు వద్ద మంగళవారం జరిగింది. అందిన సమాచారం మేరకు.. బల్లికురవ మండలం గుడిపాడుకు చెందిన వెంకాయమ్మ, నాని దంపతులు పండ్ల వ్యాపారం చేస్తుంటారు. ఈ క్రమంలో రావినూతల సంతలో పండ్లు విక్రయించుకునేందుకు ఆటోలో వెళ్లారు. ఆటో నల్లవాగు సమీపంలోకి రాగానే నక్కను ఢీకొట్టి అదుపు తప్పింది. దాంతో వెంకాయమ్మ రోడ్డు మీద ఎగిరి కిందపడి అక్కడికక్కడే మృతి చెందింది.

यूनियन बैंक Union Bank
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

అస్సెట్ రికవరీ బ్రాంచ్ (79170), విజయవాడ, చిరునామా : 4వ ఫ్లోర్, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, ఆర్.ఆర్. అప్పారావు వీధి, విజయవాడ, ఆంధ్రప్రదేశ్ - 520001.
E-mail: arb.vijayawada@unionbankofindia.bank

స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 8(6)ల నిబంధనలతో చదివే సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం స్థిరాస్తుల అమ్మకము కొరకు ఇ-వేలం అమ్మకం నోటీసు) [illegible] తేది:15-12-2023న అమ్మకం చేయుటకు నిర్ణయించినారు.

ఇ-వేలం తేది&సమయం: 15-12-2023, మ॥ 12.00 గం॥ల నుండి సా॥ 05.00 గం॥ల వరకు
ధరావత్తు సమర్పించుటకు ఆఖరు తేది: ఇ-వేలం ప్రారంభానికి ముందు వరకు

ఋణగ్రహీతలు / హామీదారులు / సహ ఋణగ్రహీతలు, బకాయి మరియు రిజర్వుధర, ధరావత్తు వివరములు దిగువ తెలుపబడినవి.

1 రిజర్వు ధర: రూ.1,22,88,000/- ధరావత్తు: రూ.12,28,800/- బిడ్ పెంపుదల : రూ.1,23,000/-

ఆస్తి నెం-2: రిజర్వు ధర: రూ.29,07,000/- ధరావత్తు: రూ.2,90,700/- బిడ్ పెంపుదల : రూ.29,100/-

ఆస్తి నెం-3: రిజర్వు ధర: రూ.22,95,000/- ధరావత్తు: రూ.2,29,500/- బిడ్ పెంపుదల : రూ.23,000/-

2 రిజర్వు ధర: రూ.6,79,000/- ధరావత్తు: రూ.67,900/- బిడ్ పెంపుదల : రూ.6,790/-

3 రిజర్వు ధర: రూ.1,90,83,000/- ధరావత్తు: రూ.19,08,300/- బిడ్ పెంపుదల : రూ.1,90,830/-

4 రిజర్వు ధర: రూ.20,84,000/- ధరావత్తు: రూ.2,08,400/- బిడ్ పెంపుదల : రూ.20,840/-

5 రిజర్వు ధర: రూ.25,14,000/- ధరావత్తు: రూ.2,51,400/- బిడ్ పెంపుదల : రూ.25,140/-

6 రిజర్వు ధర: రూ.1,64,97,000/- ధరావత్తు: రూ.16,49,700/- బిడ్ పెంపుదల : రూ.1,65,000/-

ఆస్తి నెం-2: రిజర్వు ధర: రూ.42,28,000/- ధరావత్తు: రూ.4,22,800/- బిడ్ పెంపుదల : రూ.42,300/-

ఆస్తి నెం-3: రిజర్వు ధర: రూ.35,00,000/- ధరావత్తు: రూ.3,50,000/- బిడ్ పెంపుదల : రూ.35,000/-

ఆస్తి నెం-4: రిజర్వు ధర: రూ.19,93,000/- ధరావత్తు: రూ.1,99,300/- బిడ్ పెంపుదల : రూ.20,000/-

7 రిజర్వు ధర: రూ.19,60,000/- ధరావత్తు: రూ.1,96,000/- బిడ్ పెంపుదల : రూ.19,600/-

8 రిజర్వు ధర: రూ.28,72,000/- ధరావత్తు: రూ.2,87,200/- బిడ్ పెంపుదల : రూ.28,720/-

9 రిజర్వు ధర: రూ.30,24,000/- ధరావత్తు: రూ.3,02,400/- బిడ్ పెంపుదల : రూ.30,240/-

రిజర్వు ధర: రూ.22,82,000/- ధరావత్తు: రూ.2,28,200/- బిడ్ పెంపుదల : రూ.22,820/-

10 రిజర్వు ధర: రూ.25,49,700/- ధరావత్తు: రూ.2,54,970/- బిడ్ పెంపుదల : రూ.25,497/-

11 రిజర్వు ధర: రూ.24,44,000/- ధరావత్తు: రూ.2,44,400/- బిడ్ పెంపుదల : రూ.24,500/-

రిజర్వు ధర: రూ.95,47,000/- ధరావత్తు: రూ.9,54,700/- బిడ్ పెంపుదల : రూ.95,500/-

12 రిజర్వు ధర: రూ.1,37,75,000/- ధరావత్తు: రూ.13,77,500/- బిడ్ పెంపుదల : రూ.1,37,750/-

13 రిజర్వు ధర: రూ.73,43,000/- ధరావత్తు: రూ.7,34,300/- బిడ్ పెంపుదల : రూ.73,430/-

14 రిజర్వు ధర: రూ.3,16,13,000/- ధరావత్తు: రూ.31,61,300/- బిడ్ పెంపుదల : రూ.3,16,130/-

15 బకాయి మొత్తం: తేది.31-05-2017 నాటికి రూ.21,98,385.10 పై + తదుపరి వడ్డీ, కాస్ట్ మరియు ఇతర ఖర్చులు వెలుపరంగా.
రిజర్వు ధర: రూ.14,22,000/- ధరావత్తు: రూ.1,42,200/- బిడ్ పెంపుదల : రూ.14,220/-

రిజర్వు ధర: రూ.11,05,000/- ధరావత్తు: రూ.1,10,500/- బిడ్ పెంపుదల : రూ.11,050/-

16 రిజర్వు ధర: రూ.14,40,000/- ధరావత్తు: రూ.1,44,000/- బిడ్ పెంపుదల : రూ.14,500/-

17 రిజర్వు ధర: రూ.6,09,000/- ధరావత్తు: రూ.60,900/- బిడ్ పెంపుదల : రూ.6,500/-

రిజర్వు ధర: రూ.6,09,000/- ధరావత్తు: రూ.60,900/- బిడ్ పెంపుదల : రూ.6,500/-

రిజర్వు ధర: రూ.6,30,000/- ధరావత్తు: రూ.63,000/- బిడ్ పెంపుదల : రూ.6,500/-

రిజర్వు ధర: రూ.42,50,000/- ధరావత్తు: రూ.4,25,000/- బిడ్ పెంపుదల : రూ.42,500/-

రిజర్వు ధర: రూ.21,25,000/- ధరావత్తు: రూ.2,12,500/- బిడ్ పెంపుదల : రూ.21,500/-

రిజర్వు ధర: రూ.21,25,000/- ధరావత్తు: రూ.2,12,500/- బిడ్ పెంపుదల : రూ.21,500/-

18 రిజర్వు ధర: రూ.1,12,00,000/- ధరావత్తు: రూ.11,20,000/- బిడ్ పెంపుదల : రూ.1,12,000/-

రిజర్వు ధర: రూ.2,69,22,000/- ధరావత్తు: రూ.26,92,200/- బిడ్ పెంపుదల : రూ.2,69,220/-

రిజర్వు ధర: రూ.2,36,24,000/- ధరావత్తు: రూ.23,62,400/- బిడ్ పెంపుదల : రూ.2,36,240/-

[illegible] https://www.ibapi.in [illegible] www.unionbankofindia.co.in [illegible] Mail ID : arb.vijayawada@unionbankofindia.bank [illegible]

తేది : 23.11.2023 & 28.11.2023
ప్రదేశం : విజయవాడ
సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ బ్రాంచ్, విజయవాడ